## క్లుప్తంగా

### ఎస్.కోట రూరల్ సీఐగా రవికుమార్


సీఐ కె.రవికుమార్

వేపాడ: శృంగవరపుకోట రూరల్ సీఐగా కె.రవికుమార్ బొద్దాం రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆది వారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పార్వతీపురం రూరల్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇది వరకు ఇక్కడ సీఐగా పనిచేసిన హెచ్.ఉపేంద్రకు రాజాం బదిలీ అయ్యింది. బాధ్యతలు స్వీకరించి న అనంతరం సీఐ రవికుమార్ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో ఉన్న పెండింగ్ కేసులను పరిష్కరించ డంతో పాటు శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి అమ్మవారు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ నేతృత్వంలో అమ్మవారికి ఆదివారం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ ఆదివారం మాదిరిగానే ఉదయం 5 గంటలకే అమ్మవారికి అభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. దేవస్థానం కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ ఆధ్వర్యంలో ఆలయం వద్ద భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

### గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు


చింతపల్లిపేటలో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్ శ్రీదేవి

గుర్ల: మండలంలోని చింతపల్లిపేట, పెద్దబంటుపల్లిలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు జమ్ము శ్రీదేవి, సతీష్ ఆదివారం పారిశుద్ధ్య పనులు చేయించారు. వీధికాలువల్లో పూడిక, చెత్తను పారిశుద్ధ్య కార్మికులతో తీయించారు. దోమలు, ఈగల నివారణకు కాలువల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సర్పంచ్‌లు సూచించారు.

### సీఐకి సన్మానం


సీఐ ఎస్.వి.ప్రభాకరరావును సన్మానిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, తదితరులు

గజపతినగరం: స్థానిక సీఐగా పనిచేసి విశాఖపట్నానికి బదిలీ అయిన ఎస్.వి.ప్రభాకరరావును పోలీస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి బెల్లాన కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా సన్మానించారు. ఆయనకి బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, భోగాపురం సీఐ రామకృష్ణ, గజపతినగరం నూతన సీఐ జి.ఎస్.వి.రమణ సాలువలతో సత్కరించారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు. స్థానిక ఎస్‌ఐ యు.మహేష్, మానాపురం, బూర్జివలస, ఆండ్ర, బొండపల్లి ఎస్‌ఐలు,సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### గ్రంథాలయానికి పుస్తకాల వితరణ


లైబ్రేరియన్ శ్రీధర్‌కు పుస్తకాలు అందజేస్తున్న మూర్తి, సూర్యారావు

శృంగవరపుకోట: స్థానిక శాఖాగ్రంథాలయానికి పట్టణానికి చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి ఎం.ఎస్.ఎన్.మూర్తి, ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకుడు డి.సూర్యారావు సుమారు రూ.2400 విలువ చేసే పుస్తకాలు వితరణ చేశారు. డీఎస్సీ అభ్యర్థులకు ఉపయోగపడే పుస్తకాలను లైబ్రేరియన్ డి.శ్రీధర్‌కు ఆదివారంఅందజేశారు. దాతలకు లైబ్రేరియన్ కృతజ్ఞతలు తెలిపారు.

### 16వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు

దత్తిరాజేరు: మండలంలోని గ్రామాల్లో ఈనెల 16వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ విజయభాస్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 45 రోజుల పాటు నిర్వహించనున్న ఈసభలకు సంబంధించి గ్రామాల వారీగా షెడ్యూల్‌ను సోమ వారం ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో భూసమస్యలు పరిష్కరించేందుకు ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి


గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న రోగులు

- రోజుకు 300 నుంచి 400 వరకు ఓపీ నమోదు
- అందుబాటులో నాలుగు వార్డులు, 30 పడకలు
- బెడ్లు చాలక ఇబ్బంది పడుతున్న రోగులు
- 30 పడకల నుంచి 100 పడకల స్థాయికి పెంచిన గత ప్రభుత్వం
- భవన నిర్మాణాలు, ఇతర సదుపాయాల కల్పనకు రూ.17.50 కోట్లు మంజూరు
- చివరిదశలో నిలిచి పోయిన పనులు
- రోగులు, సిబ్బందికి తప్పని అవస్థలు


రోగులకు వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సత్యశేఖర్


చివర దశలో ఆస్పత్రి అదనపు భవన నిర్మాణాలు

గజపతినగరం: స్థానిక ఏరియా ఆస్పత్రికి రోజురోజుకు రోగుల తాకిడి పెరుగుతోంది. ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీంతో జ్వర పీడితులు ఏరియా ఆస్పత్రికి క్యూకడుతున్నారు. వీరితో పాటు సాధారణ ఆరోగ్య సమస్యలతో వచ్చే వారితో ఆస్పత్రి కిటకిటలాడుతోంది. వారం రోజులుగా రోజుకు 300 నుంచి 450 వరకు ఓపీ నమోదవుతుండడంతో ఆస్పత్రిలోని ఉన్న నాలుగు వార్డులూ రోగు లతో నిండిపోతున్నాయి. గజపతినగరంతో పాటు బొండపల్లి, దత్తిరాజేరు, మెంటాడ మండలాల నుంచి అధిక సంఖ్యలో రోగులు వస్తున్నారు. నియోజకవర్గ కేంద్రంలో ఉన్న ఈ ఆస్పత్రిలో కేవలం 30 పడకలు, నాలుగు వార్డులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.జ్వరపీడితులతో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో వచ్చే వారు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారు, గర్భిణులు ఇలా అందరికీ కలిసి 30 పడకలే అందుబాటులో ఉండడంతో బెడ్లతో పాటు గదులు చాలక రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. వార్డుల్లో ఖాళీ ఉన్న చోట ఆస్పత్రి సిబ్బంది అదనపు బెడ్లు ఏర్పాటు చేస్తున్నప్పటికీ అవి కూడా సరిపోవడం లేదు.

**100 పడకల స్థాయికి పెంచిన గత ప్రభుత్వం**

30 పడకల సామర్థ్యంతో సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)గా ఉన్న ఈ ఆస్పత్రిని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏరియా ఆస్పత్రిగా మారుస్తూ 100 పడకల స్థాయికి పెంచింది. 100 పడకల ఆస్పత్రికి సరి పడా వైద్యసిబ్బందిని నియ మించింది. ఆస్పత్రిలో అదనపు భవనాల నిర్మాణానికి, ఇతర సదుపాయాల కల్పనకు నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సుమారు రూ.17.50 కోట్లు మంజూరు చేశా రు. ఈనిధులతో ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి భవనంపైనే రెండో అంతస్తు, పక్కనే మరో మూడు అంతస్తుల భవన నిర్మాణ పనులను గత ప్రభుత్వ హయాంలోనే ప్రారంభించి, శ్లాబ్‌ల నిర్మాణం వరకు చేపట్టా రు. ఈదశలో ఎన్నికలు రావడంతో ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పనుల్లో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. మిగిలిన పనులు త్వరగా పూర్తి చేసి భవనాలను ప్రారంభించి, 100 పడకలను అందుబాటులోకి తెస్తే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని, అధికారులు స్పందించి పనులను పూర్తి చేయించాలని నియోజకవర్గ ప్రజ లు కోరుతున్నారు.

**పనులు పూర్తయితే మెరుగ్గా సేవలు**



100 పడకల ఆస్పత్రి నిర్మాణం పనులు పూర్తి చేసి, భవనాలను అందుబాటులోకి తెస్తే రోగులకు మరింత మెరుగ్గా వైద్యసేవలు అందించగలుగుతాం. ఒక్కో విభాగానికి ప్రత్యేకంగా వార్డులు,వైద్యపరికరాలు ఉంటే రోగి పరిస్థితి ఎంత క్రిటికల్‌గా ఉన్నా జిల్లా కేంద్రానికి పంపించాల్సిన పనిలేకుండా ఇక్కడే సేవలందించగలం. అన్ని రకాల వైద్యసేవలతో పాటు శస్త్రచికిత్సలను కూడా చేయవచ్చు. – గౌరి రామలక్ష్మి, ఆర్ఎంఓ, గజపతినగరం ఏరియా ఆస్పత్రి

# దెందేరులో క్యాన్సర్ వైద్య శిబిరం


కొత్తవలస: దెందేరులో సేవలందిస్తున్న మహాత్మ గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్య సిబ్బంది


మెరకముడిదాం: పీహెచ్‌సీలో వృద్ధుడికి నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ జాన్సన్

కొత్తవలస: మండలంలోని దెందేరు గ్రామంలో సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విశాఖపట్నానికి చెందిన మహాత్మ గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు.శిబిరంలో క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు సుదానంద, శ్వేత, రమ్య 116 మందికి వైద్యపరీక్షలు చేసి, నలుగురు వ్యక్తులకు క్యాన్సర్ ప్రాథమిక లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. వీరిని విశాఖపట్నంలో క్యాన్సర్ ఆస్పత్రికి తీసుకెళ్లి మరిన్ని పరీక్షలు చేస్తా మని వైద్యులు తెలిపారు.అనంతరం ట్రస్టు చైర్మన్ కనకాల శివ మాట్లాడుతూ వైద్యశిబిరం ఏర్పాటుకు సహక రించిన గ్రామస్తులకు, శిబిరంలో సేవలందించిన వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ మాజీ సర్పంచ్ విరోతి శివాజీ, గనిశెట్టి పాలం ఉప సర్పంచ్ జామి కొండలరావు, స్థానికులు జామి సూరిబాబు, గవర ముత్యాలనాయుడు, లాలం భారతి, గవర ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

**మెరకముడిదాంలో నేత్రవైద్య శిబిరం**

మెరకముడిదాం: స్థానిక పీహెచ్‌సీలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, అమ్మ స్వ చ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 85 మందికి ఆప్తాలమిక్ జాన్సన్ నేత్ర పరీక్షలు చేసి 47 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. శస్త్రచికిత్సలకు ఎంపిక చేసిన వారిని ఆపరేషన్‌ల నిమిత్తం విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రామారావు, శిబిరం సమన్వయకర్త సీహెచ్.వెంకటరమణ, అమ్మ స్వచ్ఛందసేవా సంస్థ ప్రతినిధి డి.సురేష్‌కుమార్, శంకర్‌ఫౌండేషన్ సిబ్బంది సతీష్, హేమంత్‌వర్మ, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

### బంగారమ్మ తల్లి పండగ

గుర్ల: మండలంలోని పెనుబర్తి గ్రామంలో బంగారమ్మ తల్లి పండగను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారి గుడికి ఊరేగింపుగా వెళ్లి పసుపు, కుంకమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతీ ఏడాది వరి నాట్లు ప్రారంభించే సమయంలో అమ్మ వారి పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామపెద్దలు తుమ్మగుంటి పరమేష్, సంచాన సన్యాసినాయుడు, అంబల్ల చిన్నారావు, గుషిడి సూర్యారావు తెలిపారు.

# రిజర్వేషన్లను కాపాడుకోవాలి..

- మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

విజయనగరం ఫోర్ట్: మాలలంతా ఏకమై రిజర్వేషన్లను కాపాడుకోవాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ అన్నారు. నగరంలోని మాల మహానాడు కార్యాలయంలో మాల మృతవీరుల సంస్మరణ దినం ఆదివారం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేయడంతో పాటు మాల మృతవీరుల చిత్రాల వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. 1997 ఆగస్టు 11న హలో మాల – చలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టగా లక్షలాది మంది వచ్చారన్నారు. మాలలంతా లక్షలాదిగా హైదరాబాద్ చేరుకోవడంతో బషీరాబాగ్ ప్రెస్‌క్లబ్ వద్ద పోలీసులు ఇనుప ముళ్ల కంచెలు వేసి అడ్డుకున్నారని గుర్తు చేశారు. వాటిని దాటుకుని వెళ్లిన వారిపై భాష్పవాయువు ప్రయోగించి, గుర్రాలతో తొక్కించారని తెలిపారు. అప్పటికీ మాలలు ఆగకపోవడంతో పోలీసులు జరపడంతో నలుగురు మృతి చెందగా.. వేలాది మంది తీవ్రంగా గాయపడ్డారన్నారు. అప్పటినుంచి ప్రతి ఏడాదీ ఆగస్టు 11న మాల మృతవీరుల సంస్మరణ దినం జరుపుకుంటున్నట్లు చెప్పారు. తాజాగా సుప్రీంకోర్టు ఆదేశాలతో మళ్లీ ఎస్సీ వర్గీకరణ అంశం తెరమీదకు వచ్చిందన్నారు. వర్గీకరణ రాష్ట్రంలో అమలు కాకుండా మాలలంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు చోళ్ల సింహాచలం, మైలపల్లి నాగరాజు, ఎస్.ఆనంద్, ఎ. మురళి, కె. విజయలక్ష్మి, బి. పద్మావతి, జె.సావిత్రి, జి. తులసి, పి.సూరిబాబు, సునీత, రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


ఇంటింట ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు గోవింద, తదితరులు

గంట్యాడ: మండలంలోని కొఠారుబిల్లి గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు ఆదివారం సాయంత్రం త్రైత సిద్ధాంత భగవద్గీత, కృష్ణాష్టమి ఊరేగింపు, విశిష్టతపై ప్రచారం చేశారు. ప్రబోధసేవాసమితి ఇందూజ్ఞాన వేదిక విజయనగర పట్టణ అధ్యక్షుడు బత్తుల గోవింద మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవానుడికి మాత్రమే ఊరిగింపు చేయాలని అన్నారు. ప్రతీ మానవుడు తాను చేసిన కర్మ ప్రతిఫలాన్ని తప్పక అనుభవిస్తాడని, కర్మ యోగం, విశిష్టత గురించి త్రైత సిద్ధాంత భగవద్గీత తెలియజేస్తుందన్నారు. ప్రబోధ సేవా సమితి సభ్యులు తులసిరావు, ధనుంజయ్, శ్రీదేవి, శ్రీనివాస్, నారాయణమ్మ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### గురుకులంలో మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగులు సీట్లను ఈనెల 20 లోగా స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ యు.ఉషారాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ విద్యార్థినులు అర్హులని పేర్కొన్నారు. ఐదో తరగతిలో 35 సీట్లు, ఆరోతరగతిలో 9సీట్లు, 7వ తరగతిలో 13 సీట్లు, 8వ తరగతిలో 14 సీట్లు, 9వ తరగతిలో 13 సీట్లు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 4 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. గురుకులంలో చేరాలనుకునే విద్యార్థినులు స్టడీ సర్టిఫికెట్, విద్యార్థిని, తల్లిదండ్రుల ఆధార్ కార్డుల జెరాక్సులు, టీసీ, కులం, ఆదాయ ధ్రువపత్రాలు, ఐదు కలర్ పాస్‌పోర్టు సైజుఫోటోలు తీసుకుని పాఠశాలకు రావాలని సూచించారు. ఇంటర్మీడియట్‌కు పదోతరగతి సప్లమెంటరీలో ఉత్తీర్ణులైన విద్యార్థిను లు కూడా అర్హులేనని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### నేటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

చీపురుపల్లి: మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లకు, కార్యదర్శులకు సోమవారం నుంచి ఈనెల 14 వరకు మూడు రోజులు ఏపీ ఎస్ఐఆర్‌డీపీఆర్ ఆదేశాల మేరకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ డి.శ్వేత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పారిశుద్ధ్య, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, స్ట్రీట్ లైటింగ్ నిర్వహణ తదితర అంశాలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మండలం లోని సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరవ్వాలని కోరారు.

**దత్తిరాజేరు మండలంలో...**

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి 14వ తేదీ వరకు సర్పంచ్‌ల, పంచాయతీ కార్య దర్శులకు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ తరగతులను ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు ప్రారంభిస్తారని, సర్పంచ్‌లు , పంచాయతీ కారదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

### టేకు దుంపల పంపిణీ


రైతులకు టేకు దుంపలు పంపిణీ చేస్తున్న జియో సభ్యులు

శృంగవరపుకోట: స్థానిక గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) ఆధ్వర్యంలో రైతులకు ఆదివారం వెయ్యి టేకు దుంపలు రాయితీపై పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని స్థానిక కోర్టు బార్ అసోసియేషన్ కోశాధికారి బి.త్రిమూర్తులు ప్రారంభించారు. ఈసందర్భంగా జియో వ్యవస్థాపకులు రామకృష్ణ మాట్లాడుతూ సామాజిక అడవులను పెంచాలనే వారికి జియో సంస్థ రాయితీపై టేకు దుంప లు పంపిణీ చేస్తోందన్నారు. కావాల్సిన వారు 93911 38665 నంబర్‌ను ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు. కొట్యాడ ఈశ్వరరావు, బి.హృషీకేశ్, లాస్యశ్రీ పాల్గొన్నారు.

# దివ్యాంగుల సేవలో 'గురుదేవా'


వృద్ధురాలికి కృత్రిమ కాలును తొడుగుతున్న ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు

- సెంట్రల్ విజిలెన్స్ మాజీ చైర్మన్ కేవీ చౌదరి

కొత్తవలస: మండలానికి చెందిన గురుదేవా చారిటబుల్ ట్రస్టు దివ్యాంగుల సేవలో పరితపిస్తోందని సెంట్రల్ విజిలెన్స్ మాజీ చైర్మన్ కె.వి.చౌదరి కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం కోదాడ జిల్లా మేళ్లచెరువు గ్రామంలో గురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహాసిమెంట్స్ వారి సహకారంతో 170 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాల, వీల్‌చైర్స్, ట్రైసైకిల్స్‌ను ఆదివారం అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుదేవా చారిటబుల్ ట్రస్టు దివ్యాంగులకు వరంగా మారిందన్నారు. ఎంతో మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందజేసి వారికి కొత్త జీవితాలను ప్రసాదిస్తోందని కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు, మహా సిమెంట్స్ డైరెక్టర్ వి.ఎస్.నారంగ్, జనరల్ మేనేజర్ ఎం.ఆర్.మోహన్‌రావు, ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ జె.వినోద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యరక సంఘం కార్యవర్గం ఎన్నిక


అయ్యరక సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

కొత్తవలస: ఎస్.కోట నియోజకవర్గ అయ్యరక సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో సంఘ సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా పెదిరెడ్ల వెంకటసత్యనారా యణ, ప్రధాన కార్యదర్శిగా కర్రి నూకరాజు, కోశాధికారిగా లెంక ఈశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా దన్నిన రవికుమార్, ఉపాధ్యక్షు లుగా రామదాసు కాశీ, బెహరా నాగేశ్వరరావు, పెదిరెడ్ల శ్రీను, బెహరా సంతోష్‌కుమార్, పెదిరెడ్ల కనకేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా లంక నరసారావు, జాయింట్ కార్యదర్శులుగా పెదిరెడ్ల అప్పలపాత్రుడు, కర్రి రాము,పెదిరెడ్ల రాజేష్,కర్రి కాశీప్రసాద్, పెదిరెడ్ల తాతారావు ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంఘం పెద్దలు లంక రామన్నపాత్రుడు, పి.ఎస్.ఎన్.పాత్రుడు, పెదిరెడ్ల సూరిబాబు, కర్రి శ్రీనివాస్, బంగారు రమేష్ తదితరులు హాజరయ్యారు.

# రక్తదానం...ప్రాణదానం

- ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


రక్తదాతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, తదితరులు

లక్కవరపుకోట: రక్తదానం చేయడమంటే మరొకరికి ప్రాణదానం చేసినట్లేనని, రక్తదానం ఒక గొప్ప సామాజిక సేవా కార్యక్రమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని రంగారాయపురం గ్రామానికి చెందిన యువకుడు కరెడ్ల సత్యనారాయణ గతేడాది జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన వర్ధంతి సందర్భంగా గ్రామంలో విశాఖపట్నానికి చెందిన రోటరీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే లలితకుమారి ప్రారంభించారు. శిబిరంలో 45 మంది యువకులు రక్తందానం చేశారు. రక్తదాతలను ఎమ్మెల్యే అభినందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 నుంచి 65 ఏళ్ల లోపు ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చని, అపోహలు వీడి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, టీడీపీ నాయకులు కోళ్ల రామ్‌ప్రసాద్, చొక్కాకుల మల్లునాయుడు, కొట్యాడ రమణమూర్తి, శ్రీనాథ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# దశపర్ణి కషాయం తయారీపై అవగాహన


నీలకంఠరాజపురంలో దశపర్ణి కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురం, చినగుడిపాల గ్రామాల్లో రైతులకు దశపర్ణి కషాయం తయారీ, వినియోగంపై ప్రకృతి వ్యవ సాయ సిబ్బంది ఆదివారం అవగాహన కల్పించారు. డీఎల్ఎంటీ స్వామినాయుడు మాట్లాడుతూ దశపర్ణి కషాయంతో పంటను వరి పంటను ఆశించే తెగుళ్లు, పురుగులను నివారించుకోవచ్చని, అలాగే ఇతర పంటలను ఆశించే చీడపీడల నివారణకు ఉపయోపడు తుందన్నారు. పది రకాల ఆకులు, గోమూత్రం, పేడతో దశపర్ణి కషాయం తయారు చేసే విధాన్ని వివరించారు. ఈ కషాయాన్ని 40 రోజుల తర్వాత పంటకు పిచికారీ చేసుకోవాలని సూచించారు.సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల పెట్టుబడి ఖర్చుతగ్గుతుందన్నారు. సేంద్రియ ఎరువులతో పండించిన పంటలను ఆహారంగా తీసుకునే వారు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ సన్యాసమ్మ, యూనిట్ ఇన్‌చార్జి నారాయణమ్మ, ఐసీఆర్‌పీ దేముడు, వెంకటరావు, రమణమ్మ, రామలక్ష్మి, గ్రామపెద్దలు వంటాకు నాయుడుబాబు, బోజంకి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

### 'డ్రమ్ సీడింగ్'పై అవగాహన

నెల్లిమర్ల రూరల్: మండలంలో తంగుడుబిల్లిలో డ్రమ్ సీడింగ్ విధానంపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రెడ్డీస్ ఫౌండేషన్ మండల సమన్వయకర్త రెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. డ్రమ్ సీడింగ్ పద్ధతితో ఎకరాకు రూ.6 వేల వరకు పెట్టుబడి తగ్గుతుందన్నారు. అన్నదాతలు ఈ విధానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చందక చిన్నంనాయుడు, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

### 'లవ్ రీడింగ్'కు స్పందన

డెంకాడ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన లవ్ రీడింగ్ కార్యక్రమానికి స్పందన లభించింది. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు పలు రకాల కథల పుస్తకాలు చదివారు. క్యారమ్స్, స్నేక్స్ అండ్ ల్యాడర్ వంటి ఇండోర్ గేమ్స్ కూడా ఆడారు. విద్యార్థులకు లైబ్రేరియన్ మహేష్ బిస్కెట్‌లను అందించారు.